ఊరూవాడా చవితి వేడుక



బద్వేలు అర్బన్ : ట్రాక్టర్లలో గణేశ ప్రతిమలను తరలిస్తున్న దృశ్యం



చాపాడు: గణేశుడి విగ్రహాన్ని క్రేన్ సాయంతో తరలిస్తున్న దృశ్యం



ప్రొద్దుటూరు కల్చరల్ : మార్కెట్‌లో కొనుగోలు దారుల సందడి

బద్వేలు అర్బన్ : విఘ్నాలను తొలగించి మము కాపాడ రావయ్యా అంటూ గణనాథున్ని పూజించడానికి భక్తులు సిద్ధమవుతున్నారు. శనివారం వినాయకచవితి పండుగ సందర్భంగా పండుగను ఘనంగా నిర్వహించుకునేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. పట్టణంలోని ఆయా వీధుల్లో గణపతి విగ్రహాలను కొలువుదీర్చడానికి కమిటీ నిర్వాహకులు, ప్రజలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఇప్పటికే వివిధ రకాల డిజైన్లతో భారీ మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ కోరారు. గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐలు ఎం.సత్యనారాయణ, జె.రవికుమార్, ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కొలువు దీరవయ్యా.. బొజ్జ గణపయ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రాంతాల్లో గణనాథున్ని కొలువు దీర్చేందుకు ఉత్సవ కమిటీల వారు ఏర్పాట్లు పూర్తి చేశారు. రకరకాల రంగుల పందిళ్లతో స్టేజీలను సిద్ధం చేశారు.

మట్టి గణపతిని పూజించాలి

మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని డీఎస్పీ భక్తవత్సలం పేర్కొన్నారు. స్థానిక రాజీవ్ సర్కిల్‌లో ఆదరణ స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆదరణ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, వన్ టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

శివాలయంలో 48వ గణపతి ఉత్సవాలు

స్థానిక శివాలయంలో గణపతి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో 48వగణపతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ కార్యదర్శి నరసింహారెడ్డి తెలిపారు. ఈ ఏడాది విశేషంగా 13 అడుగుల మట్టితో చేసిన చతుర్ముఖ శ్వేత గణపతిని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జోరుగా వ్యాపారం

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని శివాలయం వీధి, పాతమార్కెట్, కొర్రపాడు రోడ్డు పలు వీధుల కూడళ్లలో శుక్రవారం సాయంత్రం కొనుగోలు దారులతో కిటకిటలాడింది. పూజా సామగ్రిని కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో మార్కెట్, కోనేటి కాలువ వీధి, శివాలయం వీధి కిక్కిరిశాయి.

ప్రొద్దుటూరు : మట్టి గణపతిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని శ్రీ గణపతి సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని అరబిందో ఇంటిగ్రల్ పాఠశాల ఆవరణలో శ్రీగణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా 1,000 మట్టి గణపతి ప్రతిమలను భక్తులకు పంపిణీ చేశారు. సేవా సంఘం ప్రతినిధులు వంగనూరు మురళీధర్‌రెడ్డి, ఎం.రజనీకాంత్‌రెడ్డి, పాలగిరి రామకృష్ణారెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజుపాళెం : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండలంలోని గ్రామాలకు బొజ్జ గణపయ్య విగ్రహాలను భక్తులు తీసుకెళుతున్నారు. ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కడప తదితర పట్టణాల నుంచి వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు, లారీల్లో తరలిస్తున్నారు.

పోరుమామిళ్ల: ఊరూర ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువు దీరేందుకు గణనాథులు తరలి వెళుతున్నారు. శనివారం వినాయక చవితి కావడంతో పోరుమామిళ్లలో విగ్రహాలు కొనుగోలు చేసిన వారు ట్రాక్టర్లల్లో, ఆటోల్లో విగ్రహాలను అట్టహాసంగా తీసుకెళుతున్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

కాశినాయన : వినాయకచవితి పండుగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ హనుమంతు తెలిపారు.

గోపవరం : వినాయకచవితి సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం నుండే వినాయక ప్రతిమలను మండపాలకు తరలిస్తున్నారు. శనివారం వినాయకచవితిని మండలంలో ఘనంగా జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో యువకులు ఉత్సాహంగా వినాయక ప్రతిమలను ట్రాక్టర్ల ద్వారా ఆయా గ్రామాలకు తీసుకెళుతున్నారు.

కొలువుదీరనున్న వినాయక విగ్రహాలు

చాపాడు: వినాయక చవితి పండుగ పురస్కరించుకుని మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం వినాయక విగ్రహాలు కొలువుదీరనున్నాయి. ఈ మేరకు శుక్రవారం మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు గణేశుడి విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

మైదుకూరు : ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుని పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కళాశాలలో 'మట్టి వినాయకుని పూజిద్దాం – పర్యావరణాన్ని కాపాడుదాం'అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఖాజీపేట : వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులకు మైదుకూరు ఎస్ఐ సుబ్బారావు సూచించారు. శుక్రవారం ఖాజీపేటలో ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కాశినాయన : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉప్పలూరు, నరసాపురం, ఆకులనారాయణపల్లె గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తులసమ్మ, రమాదేవి, గురులక్ష్మి, శైలజ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఉప్పలూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార విశిష్టత గురించి వివరిస్తున్న శ్రీదేవి

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

చాపాడు: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ఆకు కూరలు, కూరగాయలు, చిరు ధాన్యాలతో కూడి పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ సూచించారు. మండల పరిధిలోని బద్రిపల్లె, విశ్వనాథపురం గ్రామాల్లో శుక్రవారం పోషణ మాసోత్సవ సందర్భన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జాస్లీన్, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీనివాసులు, అంగన్వాడీ వర్కర్లు హేమాంబ, అరుణ, అంకాలమ్మ, ప్రవళిక, ఆశా వర్కర్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని శ్రీకృష్ణదేవరాయనగర్ సచివాలయం మహిళా పోలీసు మీనా పేర్కొన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం సుమిత్రానగర్-2 అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

బి. కోడూరు ఎంఈఓపై ఫిర్యాదు

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్‌జిల్లా బి.కోడూరు ఎంఈఓగా పనిచేస్తున్న ఎం.సునీల్‌పై బద్వేల్ సిఎస్ఐ చర్చి సభ్యులు బెనడిక్ట్, గాంధీ శుక్రవారం ఆర్‌జేడీ, డీఈఓలకు ఫిర్యాదు చేశారు. బి. కోడూరు ఎంఈఓగా పనిచేస్తున్న సునీల్ ఎస్సీగా ఉంటూ బద్వేల్ నగరంలోని సెయింట్ పాల్స్ చర్చిలో కోశాధికారిగా పనిచేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం గవర్నమెంట్ ఉద్యోగం చేస్తూ మతపరమైన కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. చర్చిలో ఆర్థిక లావాదేవీలలో భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆర్‌జేడీ, డీఈఓలను కోరారు.

అంటువ్యాధులతో జాగ్రత్త

బి.కోడూరు : అంటువ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోరుమామిళ్ల సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని తంగేడుపల్లె, ప్రభలవీడు గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. దోమలార్వా నియంత్రణ, డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించాలని చెప్పారు.

అండర్ పాస్‌ను విస్తరించి నిర్మించాలి

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలోని సర్వాయిపల్లెకు సమీపంలో నిర్మిస్తున్న బళ్లారి-కృష్ణపట్నం హైవే బైపాస్ అండర్ పాస్‌ను విస్తరించి నిర్మించాలని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, సీపీఐ మైదుకూరు నియోజకవర్గం కార్యదర్శి శ్రీరాములు తదితరులు అండర్ పాస్ నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బళ్లారి-కృష్ణపట్నం హైవే బైపాస్ రహదారి నిర్మాణంలో భాగంగా సర్వాయిపల్లె, బి.కొత్తపల్లెతో పాటు ఇతర చాలా గ్రామాలకు రాకపోకలకు సంబంధించిన అండర్ పాస్‌ను చాలా చిన్నదిగా నిర్మిస్తున్నారని తెలిపారు. దీంతో ట్రాక్టర్లు, లారీలు, బస్సులు రావడానికి అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల అధికారులు వెంటనే స్పందించి 5 మీటర్ల ఎత్తుతో, 10 మీటర్ల వెడల్పుతో హైవే అండర్ పాస్‌ను నిర్మించాలని, లేనిపక్షంలో ఏపీ రైతు సంఘం ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ద పుల్లయ్య, జిల్లా సమితి సభ్యులు గోశెట్టి రామ్మూర్తి, ఏఐటీయూసీ నాయకులు బి.పీరయ్య పాల్గొన్నారు.



అండర్ పాస్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన అధికారులు

రాజుపాళెం : వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని వెల్లాల, కూలూరు, టంగుటూరు, వెలవలి గ్రామాల పరిధిలోని కుందూనదిపై ఉన్న హైలెవెల్ వంతెనల వద్ద నిమజ్జన స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేటప్పుడు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తారని, ఎటువంటి పొరపాటు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్, ఎస్ఐ వెంకటరమణ, మండల ఇన్‌చార్జి ఆర్ఐ అశోక్, వీఆర్‌ఓలు రాజశేఖర్‌రెడ్డి, సరళ, వరదోశఖర్, చలమయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ దస్తగిరి, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, వీఆర్ఏలు పాల్గొన్నారు.

• చిన్న వయసు.. పెద్ద మనసు



విరాళాన్ని కరస్పాండెంట్ రామచంద్రయ్యకు అందజేస్తున్న విద్యార్థులు

ఆ విద్యార్థులు.. అందరు పిల్లల్లాగా ఆడుతూ పాడుతూ తమదైన లోకంలో విహరించడంతో సరిపెట్టుకోలేదు. వర్షబీభత్సంతో అతలాకుతలమైన విజయవాడ వరద బాధితులను విరాళం ఇచ్చి పెద్ద మనసు చాటుకున్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని సరస్వతీ విద్యామందిరం, యూరో కిడ్స్ స్కూల్ విద్యార్థులకు తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీ రూ.79,500 వరద బాధితుల సహాయం విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ వారి ఖాతాలో జమచేసినట్లు కరస్పాండెంట్ రామచంద్రయ్య తెలిపారు.

– ప్రొద్దుటూరు కల్చరల్

క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



వనిపెంటలో ఓ వీధిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ లక్ష్మీదేవి

మైదుకూరు : గ్రామాల్లో పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీఓ పి.లక్ష్మీదేవి తెలిపారు. మండలంలోని వనిపెంట గ్రామ పంచాయతీలో శుక్రవారం సర్పంచ్ గౌస్‌లాజంతో కలసి ఎంపీడీఓ వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో ప్రధాన కూడళ్ల వద్ద, ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి సుధాకర్, గ్రామ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు త్వరగా పూర్తి చేయండి



రైతు సేవాకేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ ఎం.నాగరాజు

అట్లూరు: ఇ-పంట నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు సూచించారు. శుక్రవారం బద్వేలు మండల పరిధిలోని వనంపుల, వీరబల్లి, తిప్పనపల్లి రైతు సేవా కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఇ- పంట నమోదు, డిజిటల్ క్రాప్ బుకింగ్, ఫార్మర్ ఈకేవైసీ తదితర అంశాలపై సమీక్షా నిర్వహించారు. అనంతరం వనంపుల గ్రామంలో మణ్యం సుబ్బారెడ్డి అనే రైతు సాగు చేసిన అండుకొర్రను పరిశీలించారు. చిరుధాన్యాల సాగు లాభదాయకమని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో కోచ్‌గా నాయబ్‌రసూల్

పోరుమామిళ్ల: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈనెల 8,9,10 తేదీల్లో జాతీయస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి సబ్‌జూనియర్స్, జూనియర్స్ విభాగాల్లో 86 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు కోచ్‌గా కడప జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి మాస్టర్ నాయబ్ రసూల్‌ను నియమించినట్లు రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తిరుచినాపల్లి ఎన్ఐటీ కళాశాల ఈసీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.చంద్రబాబు నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఛాలెంజెస్ అండ్ ఇన్నోవేషన్ ఆఫ్ ఫిజికల్ డిజైన్ ఇన్ వీఎల్ఎస్ఐ టెక్నాలజీ అనే అంశంపై ఈఈఈ విద్యార్థులకు గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎల్ఎస్ఐ టెక్నాలజీ వలన బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, ఈసీఈ హెచ్‌ఓడీ శివ, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి సన్మానం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కమలాపురం మాజీ శాసనసభ్యులు పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిని శుక్రవారం బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు మున్సిపాలిటీ నేతలు కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించారు. మున్సిపాలిటీలో పార్టీ స్థితిగతులను ఆయన అడిగి తెలుసుకున్నట్లు చైర్మన్ తెలిపారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండాలని, జిల్లా పార్టీ తరఫున కూడా అండగా ఉంటామని భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆయా కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాశ్రీరాములు, వైస్ చైర్మన్ నాగంసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నకృష్ణారెడ్డి, రఘురామిరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.